క్లుప్తంగా

బాధితురాలికి పరామర్శ

కడియం: ఉన్మాది దాడిలో గాయపడి, చికిత్స అనంతరం ఇంటికి చేరిన శ్రావణిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ శుక్రవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల కోసం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఘటనా వివరాలను కుటుంబ సభ్యులు ఆయనకు వివరించారు. వైద్యం విషయంలో గణేష్ చేసిన కృషికి బాధితురాలు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. శ్రావణికి అండగా ఉంటామని గణేష్ హామీ ఇచ్చారు. ఆయన వెంట శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, వేమగిరి మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, సూరపురెడ్డి జానకి రామయ్య ఉన్నారు.

ఆర్థిక సాయం

ఉన్మాది దాడిలో గాయపడిన శ్రావణికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శుక్రవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ నాయకుడు మార్గాని సత్యనారాయణ రూ. వెయ్యి అందించారు. శుక్రవారం కడియంలో ఆమెను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారివెంట ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, చెల్లుబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

నేత్రదానం

రాజమహేంద్రవరం సిటీ: నేత్రదానంతో ఇద్దరికి ప్రపంచాన్ని చూసే భాగ్యం కలిగించవచ్చని శ్రీరాధాకృష్ణ ఐ బ్యాంక్ సెక్రటరీ తేతలి నారాయణరెడ్డి అన్నారు. మాచవరం గ్రామానికి చెందిన వెలగల రామకృష్ణారెడ్డి మృతి చెందడంతో ఆయన నేత్రాలను రాధాకృష్ణ ఐబ్యాంక్‌కు దానం చేశారు. శుక్రవారం ఇన్నీస్‌పేట రోటరీ కైలాసభూమి వద్ద రామకృష్ణారెడ్డి కార్నియాను ఐబ్యాంక్ సిబ్బంది సేకరించారు. నేత్రదానం చేసేందుకు ఎవరైనా సిద్ధపడితే 95224 55999, 95778 55999 నంబర్లకు సమాచారం ఇవ్వాలని నారాయణరెడ్డి కోరారు.

టీడీపీ శిక్షణ కార్యక్రమం

కడియం: మండలంలోని వీరవరం కల్యాణ మండపంలో శుక్రవారం టీడీపీ మండల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ నిర్వహించారు. మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటికీ పథకాలు

- పారదర్శకంగా అందిస్తున్న వలంటీర్లు
- డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు
- జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాల పంపిణీ



బొమ్మూరులో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, లబ్ధిదారులతో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. శుక్రవారం బొమ్మూరులో గ్రామ సచివాలయం–2 జగనన్న సురక్ష గ్రామసభ ఏఎంజీ ఆడిటోరియంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలను పెట్టి అభాసుపాలైందని విమర్శించారు. డబ్బులు తీసుకుని ప్రభుత్వ పథకాలకు అర్హులను ఎంపిక చేసేవారని ఆరోపించారు. సీఎం జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్లు ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అనంతరం 2,020 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఆయన, సచివాలయ కన్వీనర్లు సోమన శ్రీనివాస్, మత్సేటి శివ, మాలేటి రమేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, ఎలుగొండ లక్ష్మి, సద్గుణ రామారెడ్డి, తోడేటి రాజా పాల్గొన్నారు.

- కొంతమూరు సచివాలయం–1 జగనన్న సురక్ష కార్యక్రమం మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 3,126 ధ్రువీకరణ పత్రాలను ఆయన, సచివాలయ కన్వీనర్లు అత్తిలి భీమశంకరం, చెరుకూరి సత్యనారాయణ, పిల్లి సూర్యారావు, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణు చేతుల మీదుగా అందించారు. రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా కొంతమూరు సచివాలయం–1 వలంటీర్లు 3,126 ధ్రువీకరణ పత్రాలు అందించడంపై పలువురు అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, పార్టీ నాయకులు ఎంఎం ఆలీ, మాజీ ఉప సర్పంచ్ షేక్ మౌలాలీ, మాజీ ఎంపీటీసీ తాడేపల్లి గణేశ్వరరావు, షేక్ చానా పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలి:

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని 41, 47, 48 డివిజన్లలోని ఆయా సచివాలయాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీది పెత్తందారుల పాలన అని, వైఎస్సార్ సీపీది పేదల ప్రభుత్వమన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం జగన్ సంకల్పమన్నారు. కార్యక్రమాల్లో నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జులు బర్రే కొండబాబు, మజ్జి అప్పారావు, కొత్త విజయ రాజ్యలక్ష్మి, 41, 47, 48 వార్డుల ఇన్‌చార్జులు ఎం.సుభాష్, అజ్జరపు వాసు, సీహెచ్ సత్యవాణి, అడిషనల్ కమిషనర్ పీఎం సత్యవేణి, ఆర్ఎంసీ రెవెన్యూ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సురక్షతో ప్రజలకు విస్తృత సేవలు

కడియం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వం ద్వారా మరిన్ని విస్తృత సేవలు అందుతున్నాయని మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. వేమగిరి 4, కడియపులంక 4 సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. కడియపులంకలో 1,150 మందికి, వేమగిరిలో 825 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, తహసీల్దార్ ఎం.సుజాత, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. వేమగిరిలో ఈవోపీఆర్‌డీ పీవీవీఎస్ లక్ష్మి, నాయకులు గుబ్బల నాగార్జున, కట్టా జమీందారు, పితాని శ్రీను, నరాల శ్రీను, బైవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు. కడియపులంకలో ఊటుకూరి శ్రీను, వారరాము, బోడపాటి సత్యనారాయణ, అయితరెడ్డి తాతయ్య, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: సచివాలయం–3కి సంబంధించి జగనన్న సురక్ష గ్రామసభను స్థానిక శ్రీమతి జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో నిర్వహించారు. పలువురికి పత్రాలు అందజేశారు.

రక్తదాన శిబిరం

ప్రకాశం నగర్: రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణదాతలని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల సమన్వయకర్త రమేష్ బాబు పాల్గొన్నారు.

రేపు నర్సరీ అసోసియేషన్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం ఉదయం 10.30కు ప్రారంభమవుతుందని నూతన అధ్యక్షుడు మల్లు పోలరాజు తెలిపారు. బుర్రిలంక పీఎస్ఎం కన్వెన్షన్ హాల్లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉద్యానశాఖ ఉన్నతాధికారులు, నర్సరీ రంగ ప్రముఖులు, రైతులు పాల్గొంటారన్నారు. అధ్యక్షుడిగా తాను, ఉపాధ్యక్షుడిగా పెనుమాక కొండబాబు, సభ్యులుగా రావిపాటి రామకృష్ణ, గాజుల రత్తయ్య, తాడాల నాగేశ్వరరావు, జంగా సుబ్బారావు, పిల్లా శ్రీనివాస్, గట్టా కృష్ణభగవాన్, అడ్డగర్ల రమేష్, గరగ నాగేశ్వరరావు, గాద నాగేశ్వరరావు, కొండేపూడి నాగు, తాడాల బాలమురళీకృష్ణ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. కోఆప్టెడ్ మెంబర్‌గా వడ్లమూరి రాజేష్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

సంక్షేమమే లక్ష్యంగా జగన్ పాలన

- సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..



ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని ఒకటో డివిజన్ లాలాచెరువు తారక్‌రామ్ నగర్‌లో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ముప్పన ప్రభాకర్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి డాక్టర్ శ్రీనివాస్ ఆ ప్రాంతంలో ఇంటింటికీ పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సిటీ మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, గుత్తుల మురళీధర్, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, నగర పాలక సంస్థ ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ఘటనలు దారుణం



మణిపూర్‌లో ఘటనలకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: మణిపూర్‌లో ఆదివాసి మహిళలపై జరిగిన అనాగరిక చర్యలను నిరసిస్తూ దళిత ఐక్యవేదిక ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరిపారు. మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి, అత్యాచారానికి పాల్పడిన సంఘటన దారుణమని వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ఐక్యవేదిక కన్వీనర్ అజ్జరపు వాసు, బట్టు సునీల్, మర్రి బాబ్జీ, పటమట గణేశ్వరరావు, ఇసుక పట్ల రాంబాబు పాల్గొన్నారు.

- మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలకు నిరసనగా బైబిల్ మిషన్ రాజమండ్రి కెథడ్రాల్ చర్చి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మణిపూర్‌లో శాంతి నెలకొనాలని, ప్రేయర్ ఫర్ మణిపూర్ విక్టిమ్స్ అంటూ నినాదాలు చేశారు. బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎస్.విజయరాజు, డాక్టర్ ఎస్.సిమ్యోన్ సుదర్శన్, ఎస్.విలియం బెంటిక్, ఎస్.ఉషారాణి పాల్గొన్నారు.

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాజమహేంద్రవరం ఎల్ఐసీ మహిళా ఉద్యోగులు కన్వీనర్ శిరీష అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ చర్యకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఉద్యోగుల ఉభయ గోదావరి జిల్లాల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ మణిపూర్ ఘటనను తీవ్రంగా ఖండించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కడియం: కొండేటి సుజానమ్మ, విజయరత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దామిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల 1, 2లోని 65 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, రబ్బర్లను పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా ముద్రగడ సుధ, అన్నందేవుల అన్నవరం పాల్గొన్నారు. సుజానమ్మ జ్ఞాపకార్థం ఆమె మనవడు దేవరపల్లి రత్నరాజు విద్యార్థులకు భోజనాలు సమకూర్చారు. కార్యక్రమంలో కొండేటి వెంకటరావు, దేవరపల్లి ఫ్రాన్సిస్, ఇసుకపట్ల సురేష్, కొండేటి వాసు, హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖలలో తెలుగు అమలు



కలెక్టర్ మాధవీలతను సత్కరిస్తున్న బ్రౌన్ మందిరం నిర్వాహకులు

సీటీఆర్ఐ: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో తెలుగును పరిపాలన భాషగా తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని కలెక్టర్ మాధవీలత హామీ ఇచ్చారు. సీపీ బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి శుక్రవారం కలెక్టర్ మాధవీలతను కలిశారు. తెలుగును నిర్బంధంగా అమలు చేయాలని అభ్యర్థించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక పక్ష పత్రిక శ్రీసన్నిధానం వార్షిక సంచికను, ఆదిత్య కళాశాల అధ్యాపకుడు జీవీ నాగేశ్వరరావుకు సంబంధించిన ఆదిత్య సేవాస్త్రం అభినందన సంచికను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్‌కు సన్నిధానం శాస్త్రి జ్ఞాపిక అందజేశారు.

250 మందికి ఉద్యోగాలు

ప్రకాశం నగర్: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో దివీస్ ల్యాబోరేటరీస్ శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఆరు జిల్లాలకు చెందిన 250 విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలకు చెందిన 400 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మెడికల్ ఫిట్‌నెస్ పత్రాలు సమర్పించిన అనంతరం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తారన్నారు.

23న చలో విజయవాడ

సీటీఆర్ఐ: దళిత ఉద్యోగుల సమస్యలపై ఆదివారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎస్16 గౌరవ అధ్యక్షుడు జార్జి ఆంటోనీ అన్నారు. శుక్రవారం స్థానిక రహదారులు, భవనాల శాఖ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దళిత ఉద్యోగుల హక్కుల సాధన కోసం, ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ప్రమోషన్లలో రిజర్వేషన్‌ను రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలన్న డిమాండ్‌తో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

జాతరకు రాటముహూర్తం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 16వ డివిజన్ బాలాజీపేట ఆదర్శ నగర్‌లో ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కన్నమాంబ పేరంటాలమ్మ జాతరకు శుక్రవారం రాటముహూర్తం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసులు రెడ్డి కొబ్బరికాయ కొట్టగా, ఉత్సవ కమిటీ నేతృత్వంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈనెల 25వ తేదీన కన్నమాంబ పేరంటామ్మ జాతర చేస్తారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

రాజమహేంద్రవరం రూరల్: ఓటర్ల జాబితా సవరణను సిబ్బంది నిబద్ధతతో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారులతో ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణితో కలిసి జేసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 21 వరకూ బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. సచివాలయానికి చెందిన శాశ్వత ఉద్యోగులు కూడా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఇప్పటికే నియోజకవర్గ స్థాయి అధికారులతో, రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారన్నారు.

యాచకురాలి బ్యాగ్ లాక్కుని పరారీ

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక మార్కండేయఘాట్‌లో సత్యవతి భిక్షాటన చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె శుక్రవారం స్నానం చేసేందుకు పుష్కరఘాట్‌కు వచ్చింది. గోదావరి వరద ఉధృతంగా ఉండడంతో గేట్లకు తాళం వేసేశారు. దీంతో బయటే నిలుచుకుని నదిని చూస్తోంది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మోటార్ బైక్‌పై వచ్చి ఆమె చేతిలోని బ్యాగ్‌ను లాక్కుని పరారయ్యాడు. అందులో రూ.2 వేల వరకూ ఉందని సత్యవతి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సినిమాలు

శ్యామల	: హిడింబ	రంభ	: ఓపెన్‌హైమర్
సూర్యమినీ	: మిషన్ ఇంపాసిబుల్	మేనక	: హెర్, రంగబలి
సూర్యప్యాలెస్	: బేబీ	అప్సర	: బేబీ
స్వామి	: హిడింబ	**నామవరం**	
అశోక	: అన్నపూర్ణ ఫొటోస్టూడియో	వీఎస్ మహల్	: హిడింబ
శివజ్యోతి	: సామజవరగమన	**ధవళేశ్వరం**	
అనుశ్రీ	: కాజల్ కార్తీక	మురళీకృష్ణ	: బేబీ
రాజా	: బేబీ	**కడియం**	
ఊర్వశి	: హత్య	వెంకటసూర్య	: హిడింబ